## క్లుప్తంగా

### నేటి నుంచి గడప గడపకు..

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు, ఎగవూరు పంచాయతీల్లో బుధవారం వైఎస్సార్ సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గడప గడపకు మహా పాదయాత్రలో పాల్గొంటారని సర్పంచ్‌లు శంకర్‌రెడ్డి, కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు గాండ్లపల్లిలో మహా పాదయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. గడప గడపకు వెళ్లి మోహిత్‌రెడ్డి ప్రజలను కలుసుకుంటారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

### ఈ సేవ పూర్వజన్మ సుకృతం



పారిశుధ్య పనులు చేస్తున్న జేసీ బాలాజి

తిరుమల: తిరుమల, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా 'సుందర తిరుమల–శుద్ధ తిరుమల' కార్యక్రమంలో తాము భాగస్వాములు కావడం పూర్వజన్మ సుకృతమని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ డీకే బాలాజి అన్నారు. తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో మంగళవారం టీటీడీ ఉద్యోగులు, శ్రీవారి సేవకులతో కలిసి జాయింట్ కలెక్టర్ శ్రమదానం (స్వచ్ఛంద పరిశుభ్రత సేవ) నిర్వహించారు. ఉద్యోగులు, శ్రీవారి సేవకులతో కలిసి ఆయన నారాయణగిరి ఉద్యానవనాలను శుభ్రం చేశారు.

### అమ్మవారి సేవలో ప్రముఖులు



అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, సతీష్‌రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని మంగళవారం రాత్రి పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, డీఆర్‌డీఏ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సాంకేతిక సలహాదారుడు సతీష్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సీఐ సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

### తరగతుల నిర్వహణపై చర్యలు తీసుకోండి

తిరుపతి ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డీఐఈఓ విశ్వనాథ్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు అక్బర్, నేతలు సునీల్, ప్రవీణ్, వేమన, ఉపేంద్ర, రఘు పాల్గొన్నారు.


### 7న బీఎస్పీ బహిరంగ సభ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): బహుజన సమాజ వాది పార్టీ అధ్యక్షురాలు మాయావతి నాయకత్వంలో ఈనెల 7వ తేదీన హైదరాబాదులో నిర్వహించే బహిరంగ సభకు దళితులు తరలిరావాలని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ కోరారు. చంద్రగిరిలో మంగళవారం బహిరంగసభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బాబు, జయదేవ్, రెడ్డి లోకేష్, లత, రామ్మూర్తి, రవి, మహేశ్వరి పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన రాజేష్

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం మట్టంపల్లె వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రేణిగుంట మండలం పాపనాయుడుపేటకు చెందిన రాజేష్ బైక్‌పై చిత్తూరుకు వెళుతుండగా మఠంపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గాయపడ్డ అతడిని చంద్రగిరి 108 సిబ్బంది చంద్రశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి ప్రథమ చికిత్స చేసి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

# తిరునగరి కూడళ్లలో గంగమ్మ విగ్రహాలు

- ఎమ్మెల్యే భూమన పూజలతో భక్తులకు దర్శనం



అన్నారావు సర్కిల్ వద్ద గంగమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి, కార్పొరేటర్లు

తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ ప్రతిమలు నగరంలోని కూడళ్లల్లో మంగళవారం కొలువై భక్తుల పూజలందుకున్నాయి. ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్ర పండుగ గుర్తింపుతో గంగమ్మ జాతర వైభవంగా జరగనుంది. ఈమేరకు నగరంలోని లక్ష్మీపురం, అన్నమయ్య, ఎంఆర్‌పల్లి, రాళ్లపల్లి విగ్రహం, అన్నారావు సర్కిళ్లు, టీవీఎస్ షోరూం, వైకుంఠపురం, బాలాజీ కాలనీ, కృష్ణాపురం ఠాణా, నాలుగుకాళ్ల మండపం, అశోక్‌నగర్, సుందరయ్య నగర్, సుభాష్‌నగర్, కాటన్ మిల్, ఆటోనగర్ వంటి 15 కూడళ్లలో పందిళ్లు వేసి గంగమ్మ ప్రతిమలను కొలువుదీర్చారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సారథ్యంలో గంగమ్మ ప్రతిమలు విశేష పూజలతో భక్తుల దర్శనానికి సన్నద్ధమయ్యాయి. ముందుగా లక్ష్మీపురం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన గంగమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే భూమన ఆవిష్కరించి పూజలు చేశారు. నగరంలోని వివిధ కూడళ్లలో ఆవిష్కరించి గంగమ్మ ప్రతిమల కొలువు కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు కోటూరు ఆంజనేయులు, ఆరని సంధ్య, ఆదిలక్ష్మి, దూది కుమారి, నరసింహాచారి, మద్దాలి శేఖర్, వరికుంట్ల నారాయణ, శైలజ, మునిరామిరెడ్డి, ఉదయ్ వంశీ, వెంకటముని, పైడి సునీత, ఈశ్వరి, మోహన్, అనిల్ రెడ్డి, మాకం చంద్ర, జీవరత్నం, అనిల్ రాయల్, శేఖర్‌రెడ్డి, ఉమా అజయ్, చెంచయ్య యాదవ్ పాల్గొన్నారు. గంగమ్మ జాతర నిర్వహణ కోసం తిరుపతి మత్స్యశాఖ అధికారులు తమ వంతుగా రూ.10వేలు విరాళంగా ఎమ్మెల్యే భూమనకు అందజేశారు. విరాళం అందజేసిన వారిలో మత్స్యశాఖకు చెందిన రాజేష్‌రెడ్డి, సుమంత్, వెంకటరమణ ఉన్నారు.



ఎస్టీవీ నగర్ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూమన, ముద్రనారాయణ, ఎస్‌కే బాబు



సుభాష్ నగర్ వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, కార్పొరేటర్లు

## శాస్త్రోక్తంగా కుంభాభిషేక హోమ పూజలు



హోమ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం మహాకుంభాభిషేక మహోత్సవ హోమ, ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా సాగాయి. గంగమ్మ తల్లి ప్రతిష్ట, ఆలయ పునఃప్రారంభం సందర్భంగా ఆలయంలో చేపట్టిన మహా కుంభాభిషేక మహోత్సవం మంగళవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఇందులోభాగంగా ఆలయ ఆవరణలోని యాగశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ మండపాలలో రుత్వికులు ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు నిరంతరం 12 గంటల పాటు వేద పారాయణం, వేద మంత్రోచ్ఛరణ పఠనం చేపట్టారు. చండీహోమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు మహా మంగళ హారతి, చతుర్వేద పారాయణంతో రెండవ రోజు పూజలు పరిసమాప్తం అయ్యాయి. రెండో రోజు మహాకుంభాభిషేక మహోత్సవంలో మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి, బ్రహ్మశ్రీ చెరుకుపల్లి కైలాస్ కుటుంబ సమేతంగా పాల్గొని ప్రాణ యోగ ఆశ్రమ నిర్వాహకులు యాగశాలలోనున్న ప్రధాన కలశం వద్ద వెండి యంత్రం, బంగారు యంత్రాలకు యోగ మార్గం ద్వారా శక్తిపాతముచేసి అమ్మవారిని అనుగ్రహం ఇచ్చారు. అనంతరం గంగమ్మ తల్లిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ, ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య పాల్గొన్నారు.

## లోకేష్ హామీ మోసపూరితం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: చేనేతపై జీఎస్టీ రద్దు చేస్తామని టీడీపీ కార్యదర్శి నారా లోకేష్ ఇచ్చిన హామీ మోసపూరితమని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం విమర్శించారు. మంగళవారం ఎమ్మెల్సీ డాక్టర్ సుబ్రమణ్యం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. చేనేతన్నలను మే డే రోజు ఏప్రిల్ ఫూల్స్ చేయాలని భావిస్తే ఫుల్ పారడైజ్‌లో ఉన్నట్టేనని టీడీపీ నేతలు గుర్తించుకోవాలన్నారు. జీఎస్టీ మండలిలో అన్ని రాష్ట్రాలు కేంద్ర ప్రాతినిథ్యం ఉన్న విషయం నారా లోకేష్‌కు తెలియదా అని నిలదీశారు. జీఎస్టీ మండలి టీడీపీ మండలిగా లోకేష్ భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలంటే అన్ని రాష్ట్రాలు కేంద్రం అంగీకరించాలని గుర్తు చేశారు. చేనేతన్నలపై నిజమైన ప్రేమ ఉంటే అధికారంలో ఉన్న ఐదేళ్లు జీఎస్టీ ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. గత 30 ఏళ్లుగా బీసీలను దగా చేసిన టీడీపీని బీసీలు నమ్మరన్న విషయం గుర్తించాలన్నారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం పేరు మార్చి టీడీపీ కర్మ అనే కార్యక్రమాన్ని చేపడితే మంచిదని హితవు పలికారు. బీసీలందరికీ నవరత్న సంక్షేమ పథకాలను అందించి ప్రతి బీసీ కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి కలిగిస్తున్న ఘనత జనన్న ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

## గంజాయి మత్తులో యువకుల హల్‌చల్





పట్టుబడిన గంజాయి, గంజాయి మత్తులో ఉన్న యువకుడిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలో ముగ్గురు యువకులు గంజాయి మత్తులో హల్‌చల్ చేశారు. బైక్‌పై ప్రమాదకర స్టంట్స్ చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. వివరాలు పట్టణంలోని రెడ్డివీధిలో విశ్రాంత వీఆర్‌ఓ పట్టాభిరెడ్డి మృతి చెందాడు. మృతుడు బంధువులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో ముగ్గురు యువకులు గంజాయి మత్తులో బైక్‌పై మృతదేహంపైకి దూసుకెళ్లారు. దీంతో మృతదేహం పక్కనున్న మహిళలు, ముగ్గురు యువకులు రోడ్డుపై పడ్డారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో అక్కడున్న స్థానికులు వారిని వెంబడించి పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరు యువకులను పట్టుకోగా మరో యువకుడు బైక్‌తో పరారయ్యాడు. మత్తులో ఉన్న యువకులకు స్థానికులు దేహశుద్ధి చేసి, వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చంద్రగిరి సీఐ ఓబులేసు తెలిపారు.

## చంద్రగిరిలో మూడిళ్లలో చోరీ





ఈశ్వరి ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు, వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం

- మొన్న ఎంఆర్‌పల్లె...నేడు చంద్రగిరి
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి పట్టణంలో సోమవారం రాత్రి మూడిళ్లలో చోరీలు జరిగాయి. పోలీసుల కథనం మేరకు. కొత్తపేట శ్రీశ్రీ నగర్‌లో ఈశ్వరి ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు లోనికి ప్రవేశించారు. ఈశ్వరి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం అనంతపురం వెళ్లారు. ఇదే అదునుగా దొంగలు చొరబడ్డారు. ఇంట్లోని కప్‌బోర్డులో దాచి ఉంచిన 15 గ్రాములు బంగారం, వెండి వస్తువులు దోచుకెళ్లారు. వీటి విలువ దాదాపు రూ.లక్ష ఉంటుంది. అలాగే విజయనగర్ కాలనీకి చెందిన సుమతి తలుపులకు తాళాలు వేసి మేడపై నిద్రపోతోంది. దొంగలు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సుమతి ఎదురు ఇంట్లో ఉంటున్న మేఘన కూడా ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్లింది. మేఘన ఇంట్లో కూడా దొంగలు చోరీ చేశారు. రెండు ఇళ్లల్లో రూ.2 లక్షల విలువైన బంగారం, నగదును చోరీ అయినట్లు బాధితులు పేర్కొంటున్నారు. చోరీల అనంతరం దొంగలు ఈశ్వరి ఇంటి సమీపంలో స్నానం చేసి టవల్, సోప్ అక్కడి వదిలి వెళ్లారు. చంద్రగిరి సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలాలను పరిశీలించారు. వేలిముద్ర నిపుణులు చోరీకి సంబంధించి ఆధారాలను సేకరించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఓబులేసు తెలిపారు.

**దొంగల సవాల్**

చంద్రగిరి సబ్ డివిజన్ పరిధిలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. పర్యవేక్షణ లోపం, గస్తీ వైఫల్యంతో దొంగలు మూడు ఇళ్లు...ఆరు బీరువాలుగా రెచ్చిపోతున్నారు. మూడు అంకె అచ్చి వచ్చినట్లు ఒక్కసారి చోరీకి దిగితే కనీసం మూడు ఇళ్లను దోచేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. రెండు రోజుల కిందట ముత్యాలరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు ఇళ్లల్లో చోరీలు చేసిన దొంగలు, సోమవారం అర్ధరాత్రి చంద్రగిరిలో మరో మూడు ఇళ్లల్లో చోరీలకు దిగారు. వరుస చోరీలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



శ్రీవారిని దర్శించుకున్న చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, తెలంగాణ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు.

### సమతా సైనిక్ దళ్ నూతన కమిటీ



మాట్లాడుతున్న సురేష్

తిరుపతి కల్చరల్: సమతా సైనిక్ దళ్ తిరుపతి నగర నూతన కమిటీని ఎంపిక చేసినట్లు సమతా సైనిక్ దళ్ తిరుపతి నియోజకవర్గం అధ్యక్షుడు పున్నాక సురేష్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నూతన కమిటీని ప్రకటించారు. సమతా సైనిక్ దళ్ తిరుపతి నగర అధ్యక్షుడుగా ఆర్.కల్యాణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గండికోట సుబ్రమణ్యం, నియోజక వర్గం ప్రధాన కార్యదర్శిగా నాంపల్లి రామ్మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాణిపాకం రాజేష్, మహిళా విభాగం తిరుపతి నగర అధ్యక్షురాలుగా నల్లాని నిర్మలను నియమించినట్లు తెలిపారు. సమతా సైనిక్ దళ్ తిరుపతి జిల్లా యూత్ అధ్యక్షుడు కలవకుంట చెన్నకేశవులు, మహిళా అధ్యక్షురాలు ఎస్.రజినికుమారి, రేణిగుంట మండలం అధ్యక్షుడు కొత్రమంగళం కృష్ణయ్య పాల్గొన్నారు.

### అమరావతి రియల్ ఎస్టేట్, టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రారంభం



అమరావతి రియల్‌ఎస్టేట్, టూర్స్, ట్రావెల్స్ ప్రారంభిస్తున్న లక్ష్మీదేవి, శివశంకర్‌రాజు

తిరుపతి మంగళం: మంగళం బొమ్మల క్వార్టర్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అమరావతి రియల్ ఎస్టేట్, టూర్స్ అండ్ ట్రావెల్స్ కార్యాలయాన్ని మంగళవారం రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి, తిరుమలనగర్ పంచాయతీ అధ్యక్షుడు గుండ్రాజు శివశంకర్‌రాజు ప్రారంభించారు. సామాన్య, మధ్య తరగతి వారికి తక్కువ ధరకే ప్లాట్లు విక్రయించడం, టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా సుదూర ప్రాంతాలను సందర్శింపజేస్తామని అమరావతి రియల్ ఎస్టేట్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత గణేష్ తెలిపారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళం పంచాయతీ ఉపసర్పంచ్ బైరెడ్డి రమేష్, నేత జయప్రకాష్, ఎన్. మల్లికార్జున పాల్గొన్నారు.

## రుయా సెక్యూరిటీపై దాడి



రోగుల సహాయకులు, సెక్యూరిటీ సిబ్బందితో చర్చిస్తున్న బండ్ల చంద్రశేఖర్, డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బందిపై రోగుల సహాయకులు దాడికి పాల్పడ్డారు. ఏర్పేడు మండలానికి చెందిన చందు మునేంద్ర రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం మంగళవారం వచ్చారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న బంధువులు రుయా అత్యవసర విభాగానికి చేరుకుని చికిత్స పొందుతున్న బాధితులను ఫొటోలు, వీడియోలు తీసే క్రమంలో సెక్యూరిటీ సిబ్బంది వారించారు. ఇందులో కొంతమంది యువకులు కేకలు వేస్తూ సెక్యూరిటీ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడ్డారు. రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్, ఏఆర్ఎంఓ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి అక్కడికి చేరుకుని గొడవ సద్దుమణిగేలా చేశారు. దాడికి పాల్పడ్డ వారిపై అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఆటో కార్మికులకు యూనిఫామ్ పంపిణీ





తిరుచానూరులో మహిళా ఆటో కార్మికులకు పంపిణీ చేస్తున్న మోహిత్‌రెడ్డి, భాకరాపేటలో..

తిరుచానూరు/భాకరాపేట/: అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆటో కార్మికులకు మూడు జతల ఖాకీ దుస్తులు అందజేశారు. నియోజకవర్గం పరిధిలోని తిరుచానూరు, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లోని ఆటో కార్మికులకు మంగళవారం చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పంపిణీ చేశారు.



ఎర్రావారిపాళెంలో..

### ఎమ్మెల్యే చెవిరెడ్డి చొరవతో..

# 75 ఏళ్ల నిరీక్షణకు తెర





నడకదారిగా ఉన్న యల్లంపల్లి రహదారి, ఎమ్మెల్యే చెవిరెడ్డి చొరవతో రహదారిగా మార్చుతున్న వైనం

- మూలపల్లి నుంచి యల్లంపల్లికి గ్రావెల్ రోడ్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): దశాబ్దాల పాటు రహదారి లేక కష్టాలు పడుతున్న గ్రామస్తులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో చంద్రగిరి మండలం, మూలపల్లి ఎస్టీ కాలనీ నుంచి యల్లంపల్లి గ్రామానికి మధ్య ఉన్న దారి కష్టాలు తీరాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చంద్రగిరి మండలం, మూలపల్లి పులిచెర్ల మండలానికి వెళ్లే అటవీ మార్గంలో ఉంది. ఈ గ్రామం నుంచి పంచాయతీ కార్యాలయం ఎల్లంపల్లికి పోవాలంటే ప్రజలు ఆరేడు కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి. మూలపల్లి నుంచి యల్లంపల్లికి వెళ్లాలంటే అడవిలో నుంచి రెండు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లాల్సిందే. నడకదారిని రహదారిగా మార్చాలని ఎంతోమందిని గ్రామస్తులు వేడుకున్నారు. ఇటీవల సమస్యను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రోడ్డును ఏర్పాటు చేయాలని ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డికి సూచించారు. అటవీ, పంచాయతీరాజ్ అధికారులను సమన్వయం చేసి రూ.10 లక్షలను మంజూరు చేయించారు. ఆగమేఘాల మీద పనులను ప్రారంభించారు. రెండు రోజులుగా జేసీబీ సాయంతో రోడ్డు చదును చేసి, గ్రావెల్‌తో రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో మూలపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

## సాగర్ పనులపై కమిషనర్ ఆగ్రహం



వినాయక సాగర్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్‌సిటీలో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న వినాయకసాగర్ పనుల ఆలస్యంపై కమిషనర్ హరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీర్లతో కలిసి వినాయకసాగర్, డిస్ట్రిక్ట్ ఆర్ట్ స్టూడియోను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సాగర్ అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ పనులు నత్తనడకన సాగుతుండడంపై వివరణ కోరారు. అంతకుముందు సాగర్ ప్లాన్ ట్రాక్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి నగరానికి తలమానికంగా ఉండాలన్న లక్ష్యంతో సాగర్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. గడచిన రెండేళ్లుగా పనులు చేస్తూనే ఉంటారా, పూర్తిచేసేందుకు ఇంకెన్నిరోజులు కావాలని ఇంజినీర్లు, కాంట్రాక్టర్‌లను నిలదీశారు. అలాగే తుడా ప్రాంగణంలో నిర్మిస్తున్న డిస్ట్రిక్ట్ ఆర్ట్ స్టూడియో పనులను పరిశీలించిన కమిషనర్ జూలై లోపు పూర్తిచేయాల్సిందేనని ఆదేశించారు.

## శ్వాసకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి





జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ చంద్రశేఖర్, డాక్టర్ సుబ్బారావు

తిరుపతి తుడా: శ్వాసకోశ సంబంధిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు అన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాల పూర్వ వైద్య విద్యార్థుల భవనంలో మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో వారు మాట్లాడుతూ ఆస్తమాను నిర్లక్ష్యం చేయరాదని చెప్పారు. సామాజిక వైద్య విభాగ ప్రొఫెసర్ డాక్టర్ సునీత మాట్లాడుతూ ప్రివెంటివ్ మెజర్స్, ఆస్తమా వ్యాధి పట్ల జాగ్రత్తలు తీసుకున్నట్లయితే మొదటి దశలోనే వ్యాధిని నివారించవచ్చు అన్నారు. రుయా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### తెలుగు భాష పట్టుపై శిక్షణ తరగతులు

తిరుపతి ఎడ్యుకేషన్: తెలుగు భాషను స్పష్టంగా చదవడం, రాయడం తెలియని విద్యార్థులకు ప్రత్యేకంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు లోకేష్ స్మార్ట్ అకాడమీ డైరెక్టర్ సంగరాజు దివ్యశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ మీడియం చదువుతున్న విద్యార్థులకు తెలుగు రైటింగ్ స్కోర్ లెవెల్ (టీడబ్ల్యూఎస్‌ఎల్) పరీక్ష నిర్వహించి, వారి స్థాయిని అంచనా వేయనున్నట్లు తెలిపారు. వారు వెనుకబడ్డ అంశాలను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నేటి నుంచి ఉదయం 9నుంచి 11గంటల వరకు, సాయంత్రం 4నుంచి 6గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నామని, ఈ శిక్షణా తరగతులకు 3నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు హాజరుకావొచ్చని తెలిపారు. వివరాలకు 95350 15125నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.